క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న అశోక్‌యాదవ్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని గుండుగేరి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, హనుమాన్ దేవాలయాల నిర్మాణానికి చటాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యువనేత నందారం అశోక్‌యాదవ్ రూ.3లక్షల 69వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశోక్‌యాదవ్ విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

80శాతం ఇళ్ల సర్వే పూర్తి



కొందుర్గులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కొందుర్గు: ఇందిరమ్మ ఇళ్ల సర్వే 80 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ లాలయ్య తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 90 శాతం సర్వే పూర్తయిందని, కాగా కొందుర్గు, తంగెళ్లపల్లి మాత్రమే 50 శాతం సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



విరాళం అందిస్తున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి సోమవారం అనంత్‌రెడ్డి రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన అనంత్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజు, సత్తయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలకు తరలిన నాయకులు



సభకు వెళ్తున్న నాయకులు

కొందుర్గు: నల్గొండ పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న సీపీఐ వంద సంవత్సరాల బహిరంగ సభకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. ఎర్రజెండా పుట్టి వంద ఏళ్లు అయినప్పటికీ పేదల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. భవిష్యత్‌లో సీపీఐ చేపట్టబోయే కార్యక్రమాలపై సభలో చర్చించడం జరుగుతుందని, అన్ని గ్రామాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు నర్సింహ, వెంకటేశ్, కృష్ణ, లింగం, అనంత లక్ష్మమ్మ, అనిత, పెద్దలక్ష్మమ్మ, యశోధ, రాములు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిన నాయకులు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి కొందుర్గు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పట్ల జనవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి సమాయత్తం చేయడానికి షాద్‌నగర్‌లో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులకు పెద్ద ఎత్తున సమావేశానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఆనంద్, నాయకులు నరేందర్, చింటు పాల్గొన్నారు.

అభివృద్ధి అంతంతే!



చేవెళ్లలో హైదరాబాద్‌-బీజాపూర్ రహదారి పనులు ప్రారంభించాలని చేపట్టిన ధర్నా(ఫైల్)

- నూతన సంవత్సరానికి స్వాగతంగా సమస్యలు
- చేవెళ్లలో రాజకీయ మార్పులు మినహా సమస్యలకు దొరకని పరిష్కారం
- ఈ ఏడాదిలో నియోజకవర్గంలోని పలు సంఘటనలు జిల్లా, రాష్ట్రంలో సంచలనంగా మారటం

చేవెళ్ల: గడిచిన ఏడాదిలో నియోజకవర్గంలో అభివృద్ధి జాడ లేకుండా, సమస్యల పరిష్కారం లేక సాధారణంగా గడిచిపోయింది. ఈ ఏడాదిలో రైతుల అతివృష్టి వర్షాలతో దిగుబడులపై దెబ్బ, రియల్ వ్యాపారంతో కళకళలాడిన నియోజకవర్గంలో రియల్ వ్యాపారం డమాల్‌తో అన్నిరకాల వ్యాపారులు వెలవెలబోతూ ఏడాదికాలం గడిచిపోయింది. రాజకీయంగా ప్రభుత్వం మార్పుతో రాజకీయంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభావం తగ్గి కాంగ్రెస్‌కు, బీజేపీలకు ఆదరణ పెరిగింది. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న గత ప్రభుత్వ సమస్యలు ఈ ఏడాదిలో ఎలాంటి పరిష్కారానికి నోచుకోకుండా అలాగే ఉండిపోయాయి. నియోజకవర్గంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారి నియోజకవర్గ పేరు వినిపించింది. నియోజకవర్గ అభివృద్ధి ఆశలన్నీ నూతన సంవత్సరంపై పెట్టుకొని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

2024లో సంఘటనలు, కార్యక్రమాలు, సమస్యలు ఇలా..

- గత ప్రభుత్వాల హయాంలో జీఓ 111పై జోరుగా చర్చ, ఎత్తివేతకు ప్రతిపాదన. ఎత్తివేసినట్లు ప్రకటించిన గత ప్రభుత్వం. 2024లో ఆ ఊసే లేకుండా గడిచిపోయింది. ఈ ఏడాదిలో ఈ ప్రభుత్వంతో దీనిపై స్పష్టత కరువు.
- నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఏ పనులకు లభించని మోక్షం, ఎక్కడి పనులు అక్కడే గ్రామాలకు రోడ్లు లేని అధ్వాన పరిస్థితి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో సాధారణ నిధులు తప్పా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవటం శోచనీయం.
- నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న హైదరాబాద్‌-బీజాపూర్ జాతీయ రహదారికి లభించని మోక్షం. ప్రారంభం కాని పనులు. అఖిల పక్షం నాయకుల ధర్నాలు.
- ఈ ఏడాది ముగింపులో అసెంబ్లీలో నియోజకవర్గంలోని చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల ఏర్పాటు ప్రకటన రావటం.
- నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి హామీకి లభించని మోక్షం. నిధుల విడుదల వద్దనే ఆగిన పనులు.
- రైతులకు కలిసి రాని కాలం అధిక వర్షాలతో నియోజకవర్గంలో రైతుల పరిస్థితి అధ్వానం.
- శంకర్‌పల్లి మండలంలోని మిర్జాగూడ గ్రామం నార్సింగ్ మున్సిపాలిటీలో కలయిక.
- శంకర్‌పల్లిలోని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్‌పై హైడ్రా పేరుతో హైడ్రామా సర్వేలతో హడావిడి. కేటీఆర్ బావమరది రాజ్‌పాకల ఫాంహౌస్‌లో అనుమతిలేని పార్టీపై రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారి నియోజకవర్గం పేరు చర్చకు రావటం విశేషం.
- కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే శంకర్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం.
- కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూ చార్ట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిలుకూరులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ప్రారంభించడం.

ఘోర ప్రమాదాలతో విషాదాలు..



ఆలూరు వద్ద జరిగిన ప్రమాదంలో చెట్టును ఢీకొని ఆగిన లారీ

- ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో నలుగురు మృతితో తీవ్ర విషాదం. రోడ్డు విస్తరణ జాప్యంతోనేనని అఖిలపక్షం నాయకుల ఆందోళనలు, ధర్నాలు.
- శంకర్‌పల్లి మండలంలోని టంగటూరులో అప్పుల బాధతో తండ్రి ముగ్గురు పిల్లల ఆత్మహత్య సంఘటన విషాదం. రాష్ట్రంలో చర్చనీయం.
- హైదరాబాద్‌-బీజాపూర్ రహదారిపై చేవెళ్ల, మొయినాబాద్ మండలాల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనే ఏడాదిలో వందల సంఖ్యలో నిత్య ప్రమాదాలతో విషాదాలు.

వాడీవేడిగా రాజకీయ వర్గపోరు..



చిలుకూరులో ఎస్సీ గురుకుల పాఠశాలలో మెనూను ప్రారంభిస్తున్న సీఎం

- బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లోకి చేరటం. కాంగ్రెస్‌లో స్వల్పతేడాతో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ పరిస్థితి అగమ్యగోచరం. ఆయనకు దక్కని ఎలాంటి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు. అధికార పార్టీలోనే వర్గపోరు.
- షాబాద్ మండలానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకం. నియోజకవర్గానికి దక్కిన రాజకీయ అవకాశం.
- 2024లో బీఆర్‌ఎస్ ప్రాధాన్యత తగ్గదల. కాంగ్రెస్ అధికారంతో పెరిగిన ఆదరణ.
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో నియోజకవర్గంలో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీకి గ్రామాల్లో గుర్తింపు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీపరీక్షలు



షాబాద్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

- ఎంఈఓ పురన్‌దాస్, టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురధీర్
- సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి పోటీలు

చేవెళ్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీపరీక్షలు దోహదం చేస్తాయని మండల విద్యాధికారి పురన్‌దాస్, టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండల స్థాయిలో సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలా వారీగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మండలస్థాయిలో ఎంపిక చేసిన విజేతలకు జనవరి 4వ తేదీన నగరంలోని హయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, గోపాల్, సాంఘిక శాస్త్ర మండల కన్వీనర్ అపర్ణ, సీసీ రాజు, శ్రీకాంత్, కృష్ణ, వెంకటరమణ, వెంకటేశ్, రాఘవేందర్, నవనీత, అలివేలు, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

షాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంఘిక శాస్త్ర మండలస్థాయి ప్రతిభాపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవింద్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మండలస్థాయి పరీక్ష ఇన్‌చార్జి యూ.పోచయ్య, మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక పేరుతో మండలస్థాయి ప్రతిభ టాలెంట్ పరీక్షలను ఇన్‌చార్జి పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలకు మండలంలోని 12 జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 54 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరీక్షలో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్కుబాయి, శకుంతల, బందయ్య, చంద్రకాంత్, కళావతి, తుకారామ్, వినోద్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



చేవెళ్లలోని మండల విద్యావనరుల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న మహేశ్వరి

అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహేశ్వరి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులకు వాష్ రూమ్స్, నల్లాల ఏర్పాటుతో పాటు అక్కడ పరిసరాల పరిశుభ్రతకు దాతల సహకారంతో కృషి చేస్తున్నామని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహేశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వాష్‌రూమ్‌ల నిర్మాణం, వాటర్ ట్యాంప్‌ల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సౌకర్యాలు ఉన్నప్పుడే ఉన్నత విద్యలో అభివృద్ధి చెందుతారన్నారు. హిమాయత్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు వాష్‌రూమ్‌లు లేకపోవడంతో ఒకటి, రెండు ఉన్నా వాటిలో నీటివసతి లేకపోవడంతో మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకుగాను విద్యార్థుల సౌకర్యార్థం అందరి సహకారంతో నూతనంగా వాష్ రూమ్‌లు, నల్లా ట్యాప్స్, పరిసరాల పరిశుభ్రత పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

మార్పుతోనే కేసుల సడలింపు

కొందుర్గు: రౌడీషీటర్లుగా కేసులు నమోదైన వారు తమ నడవడిలో మార్పులు వస్తే కేసులను సడలించేందుకు వీలుంటుందని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య సూచించారు. సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లలో రౌడీషీటర్లు, అనుమానిత కేసులు నమోదైన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతలను కాపాడే విషయంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కృష్ణయ్య, విజయ్, ప్రొబేషనరీ ఎస్‌ఐలు శ్రీను, శ్రీవర్ధన్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ నర్సయ్య

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తా

ఏటీఓ బాల్‌రాజ్

షాద్‌నగర్: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీఓ) బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్‌రాజ్ హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి తన పరిధిలో ఉండే సమస్యలను పరిష్కరించేందుకు తగిన విధంగా కృషిచేస్తానని హామీనిచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామారావు, సభ్యులు సత్యనారాయణగౌడ్, నాగేశ్, మొగులయ్య, నర్సింలు, అబ్దుల్ గఫార్, జంగారెడ్డి, వీరభద్రప్ప, సాయన్న, గోపాల్‌రావు, వెంకటన్న, మోనప్ప, కృష్ణయ్య, చంద్రారెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం



చేవెళ్ల: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న వేడుకలు జరుపుకునే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 31 డిసెంబర్ రాత్రి ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాహనదారులు అర్ధరాత్రి దాటిన తర్వాత అతివేగంతో వాహనాలు నడపొద్దని, సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్‌లు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపించొద్దన్నారు. మద్యం తాగి వాహనాలతో పట్టుబడితే జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండు కూడా విధించే అవకాశం ఉందన్నారు. వాహనదారులు, ప్రజలు గమనించాలని చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిల, షాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల పేరుతో మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడిపించకూడదని హెచ్చరించారు. వేడుకలను సంతోషంగా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తనిఖీలు మాత్రం అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా కొనసాగుతాయని తెలిపారు.

అనుమతి లేకుండా పార్టీలు నిర్వహించొద్దు

శంకర్‌పల్లి: పోలీసుల అనుమతి లేకుండా న్యూఇయర్ వేడుకల్లో భాగంగా పార్టీలు, ఈవెంట్లు నిర్వహించొద్దని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, మోకిల సీఐ వీరబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ.. అనుమతి లేని పార్టీలు, ఈవెంట్లపై ప్రత్యేక దృష్టి సారించామని, దీని కోసం ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలు, ప్రభుత్వ నిషేధిత గుట్కాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాల్లో మైనర్లకు మద్యం సరఫరా చేయొద్దని సూచించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, పట్టుబడితే జైలుకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. న్యూఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పరిమితి మించి శబ్దాలు రావొద్దన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో కుమ్మరి సత్యనారాయణ ఆకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఆర్థికసాయానికి సంబంధించిన నగదును గ్రామస్తులు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కాలనీకి చెందిన అందె సరిత, జంగరాజు దంపతులు ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కొందూటి నరేందర్, రఘునాథ్‌యాదవ్, లక్ష్మినర్సింహారెడ్డి, అందె పైలయ్య, భాస్కర్, అందె మహేశ్వర్, గుండు అశోక్, అల్లాడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న రవీందర్‌యాదవ్, నాయకులు

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ

ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ పరిధిలో 25 ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో రెవిన్యూకు సంబంధించినవి 17 ఫిర్యాదులు ఉన్నాయని, వీటిలో శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు సంబంధించి 5 చొప్పున, షాబాద్ మండలానికి సంబంధించి రెండు ఉన్నట్లు తెలిపారు. ఏడు ఫిర్యాదులు ఎంపీడీఓ చేవెళ్ల కార్యాలయానికి సంబంధించినవి కాగా ఒకటి అగ్రికల్చర్ ఫిర్యాదు వచ్చినట్లు చెప్పారు. వీటిని ఆయా శాఖల వారీగా పంపించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ రాజశేఖర్ ఉన్నారు.

సొంత డబ్బులతో చెరువుకట్ట అభివృద్ధి

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్ పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేసేందుకు గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చారు. కట్టపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి, మొరం వేయించారు. సురంగల్ కట్టమైసమ్మ దేవాలయం వద్ద సోమవారం అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కడికి వచ్చిన యువకులు చెరువుకట్టపై పిచ్చిమొక్కలను గమనించి కట్టను అభివృద్ధి చేయాలని భావించి, వెంటనే గ్రామానికి చెందిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి, బొర్ర జగన్ సొంత డబ్బులు ఖర్చుపెట్టి జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగించారు. డోజర్‌తో చదును చేయించారు. త్వరలోనే మొరం పోసి కట్టను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు గౌతంరెడ్డి, ప్రభుయాదవ్, నారాయణరెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మైసయ్య, బాల్‌రాజ్, శంభుయాదవ్, సాయియాదవ్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కట్టపై జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

రోడ్డు పనులు పూర్తిచేయాలని వినతి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంలో అసంపూర్తిగా వదిలేసిన ప్రధాన రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సింగాపురం వాసులు(1,9, 10 వార్డు ప్రజలు) డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నాయకులు, సింగాపురం వాసులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సంతర్భంగా వారు మాట్లాడుతూ.. సింగాపురం గేటు నుంచి వాగువరకు రోడ్డు నిర్మాణం చేపట్టారని, అక్కడ నుంచి మిగిలిన రోడ్డును నిధుల లేమితో వదిలేశారని, తద్వారా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై అధికారులు, నాయకులు వెంటనే స్పందించి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, సింగాపురంవాసులు పాల్గొన్నారు.